అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్


ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ నేతలు

కాచిగూడ: ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల చెంతన భారతదేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా 2047 విజన్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పని చేస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం లోక్‌సభలో ఎంపీగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పోట్లకాయల వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీకి దేశ ప్రజలందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నేతృత్వంలోనే దేశ అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధికోసం ప్రజా ప్రతినిధులుగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆదివాసీ మహిళలపై దాడులు అమానుషం


మాట్లాడుతున్న సామాజికవేత్త సజయ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో కేంద్ర బలగాలు ఆదివాసీ మహిళలపై చేస్తున్న ఆకృత్యాలను అమానుషమని సామాజికవేత సజయ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజయ మాట్లాడుతూ అక్కడి నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులను నిర్మూలించే నెపంతో 'ఆపరేషన్ కగార్' పేరుతో కేంద్ర బలగాలు క్యాంపుల ఏర్పాటు చేశాయన్నారు. అందులో భాగంగా ఆదివాసీలను చుట్టుముట్టి అమాయక మహిళలను హింసిస్తున్నారన్నారు. దేశానికి ఆదివాసీ మహిళ రాష్ట్రపతిగా కొనసాగుతున్న సమయంలో దాడులు జరగడం శోచనీయమన్నారు. గత ఏడాది మణిపూర్‌లో మహిళను నగ్నంగా ఊరేగించారని, ఎందుకు ఆదివాసీ ప్రాంతాల్లోనే ఇలాంటి ఘోరాలు చోటు చేసుకుంటున్నాయని ప్రశ్నించారు. వారికి ఉన్న ప్రత్యేకమైన చట్టాలను మార్చాలనే కుట్ర చేస్తున్నారని, వారి జీవించే హక్కును కాలరాసే భాగంగానే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రముఖ విద్యావేత్త వనమాల మాట్లాడుతూ ఆదివాసీ మహిళలపై బెదిరింపులకు పాల్పడడమే కాకుండా పరిశీలన పేరుతో వారిని వివస్త్రలను చేసి అమానుషంగా దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైతన్య మహిళా సంఘం కన్వీనర్ బి.జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంధ్య, ఝాన్సీ, సృజన, బండారు విజయ, వంగపల్లి పద్మ, అరుణ, శ్రీదేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బ్లాక్ టికెట్లకు అడ్డుకట్ట వేయండి


సంధ్యా థియేటర్ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్

ముషీరాబాద్: బ్లాక్ టికెట్ల దందాకు అడ్డుకట్ట వేసి సగటు ప్రేక్షకుడికి న్యాయం చేయాలని బీజేవైఎం ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ అన్నారు. మంగళవారం కల్కి సినిమా విడుదలవుతున్న సంధ్య 70 ఎంఎం థియేటర్ ఎదుట ధర్నా నిర్వహించారు. బ్లాక్ టికెట్లను అరికట్టాలని, సంధ్యా థియేటర్ యాజమాన్యం వైఖరి నశించాలని నినాదాలు చేశారు. అనంతరం గడ్డం నవీన్ మాట్లాడుతూ సినీ వినోదానికి కేర్ ఆఫ్ అడ్రస్‌గా ఉన్న ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో కొత్త సినిమా రిలీజ్ అయినప్పుడు సగటు సినిమా ప్రేక్షకుడు, హీరోల అభిమానులు ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని థియేటర్‌ల్లో సినిమా చూడాలని కోరుకుంటారన్నారు. అయితే థియేటర్ల యాజమాన్యం, మేనేజర్లు, అభిమానుల ఆశలను నీరుగారుస్తూ బ్లాక్ టికెట్లను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

నిష్పక్షపాతంగా టికెట్ల పంపిణీ: నాగరాజు, మేనేజర్

కల్కి సినిమాను 27న తెల్లవారుజామున 4.30 గంటలకు ప్రభాస్ ఫ్యాన్స్ కోసం బెనిఫిట్ షో నిర్వహిస్తున్నాము. అందులో థియేటర్ల పాత్ర ఏమీ లేదు. 27న ఉదయం 8 గంటల నుంచి టికెట్లను పారదర్శకంగా అందజేస్తున్నాం. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నాం. ప్రతి ఒక్కరూ వచ్చి పదుల సంఖ్యలో టికెట్లు కావాలని మాపై ఒత్తిడి తెస్తున్నారు. మేము నిమిత్త మాత్రులం.

చైతన్యంతోనే బహుజనులకు రాజ్యాధికారం


మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజన సాహిత్యం, చైతన్యంతోనే రాజ్యాధికారం సిద్ధిస్తుందని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అన్నారు. సాహిత్యం ద్వారానే పూలే, అంబేద్కర్, కాన్సీరామ్‌లు కలలుగన్న రాజ్యం సాకారమవుతుందన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురు ప్రముఖులను సత్కరించారు. అనంతరం నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ బహుజన సాహిత్య అకాడమీ 27 రాష్ట్రాల్లో, ఎనిమిది దేశాల్లో విస్తరించిందన్నారు. సెప్టెంబర్ 5న న్యూ ఢిల్లీలో జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా పది వేల మంది హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకులు దరువు ఎల్లన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎం.గౌతమ్, సాహిత్య అకాడమీ సౌత్ ఇండియా కార్యదర్శి ఎర్రగుడ్ల వెంకటేష్, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జీ పి.ఎస్.వరప్రసాద్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, మామిడిపల్లి పాపయ్య, ఐలయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల సంక్షేమానికి పాటుపడాలి

లిబర్టీ: ఆర్థికంగా చితికిపోయి దుర్భర జీవితాలు సాగిస్తున్న వాల్మీకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వాల్మీకి సేవా సమాజ సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాజంలోని వివిధ సామాజిక వర్గాల కోసం ప్రభుత్వాలు పలు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని వాల్మీకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఇప్పటి వరకు లేదని ఆయన అన్నారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వృత్తిని నమ్ముకొని బతుకుబండి లాగుతున్న వాల్మీకులు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా సంస్కృతి పరంగా అన్ని సామాజిక వర్గాల కంటే వెనుకబడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సంప్రదాయ వృత్తిని చిన్న చిన్న సులభ కాంప్లెక్స్ ఏర్పాటు చేసుకొని బతుకు సాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో లక్షలాది మంది వాల్మీకుల జీవన ప్రమాణాల్లో జీవన స్థితిగతుల్లో మార్పు నోచుకోక తమ జీవితాలను సాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తీసుకొని వాల్మీకుల ఆర్థిక ప్రగతి సంక్షేమం సామాజిక అభివృద్ధి కోసం రూ. 500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వారు ఆర్థికంగా ముందడుగు వేస్తారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వాల్మీకులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని దళిత బంధు పథకాన్ని వాల్మీకుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలి

హిమాయత్‌నగర్: నీట్ 2024 పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా దేశ వ్యాప్తంగా నష్టపోయిన విద్యార్థుల పక్షాన స్పందించని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్లక్ష్య వైఖరి నశించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యువజన, విద్యార్థి సంఘాలు నిరసన తెలిపాయి. ఈ మేరకు మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిరసన కార్యక్రమ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా హాజరైన నేతలు మాట్లాడుతూ రేపు రాష్ట్ర వ్యాప్తంగా మోదీ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మోడీ దిష్టిబొమ్మను రాష్ట్ర వ్యాప్తంగా దహనం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కేవలం ఎన్‌టిఏ డైరెక్టర్‌ను తొలగించడం కాదని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను సమూలంగా రద్దు చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పుతూ తిరిగి పరీక్షను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఎస్ఎస్.యు.ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి అభిజిత్ యాదవ్, ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్ రెడ్డి, పి.డి.ఎస్.యు కార్యదర్శి శ్రీను, కల్లూరు ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

జలం కాదు..గరళం..

తాగితే.. అంతే.!

- నల్లాల్లో కలుషిత నీటి సరఫరా
- మంచాన పడుతున్న నింబోలిఅడ్డ వాసులు
- తరచూ తలెత్తుతున్న సమస్యలతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కలుషిత నీటిని చూపిస్తున్న మహిళలు


కార్పొరేటర్‌కు సమస్యను వివరిస్తున్న స్థానికులు

కాచిగూడ: తాగునీటికి అల్లాడిపోతున్నారు. వాటర్ బాటిళ్లు, నీళ్ల క్యాన్లను కొనుక్కుంటున్నారు. జాగ్రత్తగా వాడుకుంటున్నారు. స్తోమత లేనివారు నల్లాల నుంచి సరఫరా అయ్యే కలుషితనీటినే తాగి అనారోగ్యం పాలవుతున్నారు. ఆస్పత్రులకు డబ్బు ధారపోస్తున్నారు. ఇదీ నింబోలిఅడ్డలోని రైల్వేట్రాక్ బస్తీ వాసుల దుస్థితి. నల్లాల నుంచి వచ్చే తాగునీరు తాగేందుకు బస్తీవాసులు జంకుతున్నారు. వారం, పదిరోజులుగా పూర్తిగా నల్లాల ద్వారా డ్రైనేజీ నీరు సరఫరా అవుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తాము అవస్థలు పడుతున్నామని బస్తీవాసులు వాపోతున్నారు.

- తాగేందుకు కాదుకదా కనీసం దుస్తులు ఉతకడానికి కూడా ఈ నీరు పనికి రావడం లేదంటున్నారు. వంటకు ఇతర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవడం గానీ, నీళ్లక్యాన్లు కొనుక్కొని వాడాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ ఇబ్బందులను గ్రహించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడంవల్లనే తమకు ఈ దుస్థితి ఎదురవుతోందని అంటున్నారు. నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా జరుగుతుండటంతో తాము స్నానాలు కూడా చేయలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి మంచినీటి నల్లాల ద్వారా డ్రైనేజీ నీరు సరఫరా కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో జలమండలి కార్యాలయం ముందు ధర్నా చేపడతామని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

పురుగులు కలిసిన నీటి సరఫరా..

కలుషిత నీటి సరఫరాతో పాటు పురుగులు కలిసిన నీరు సరఫరా అవుతోందని స్థానికులు తెలిపారు. ఒక్కోసారి ఈ నీళ్లను చూస్తేనే వాంతులు వచ్చే విధంగా పరిస్థితి తయారైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ లైన్లు మంచినీటి పైపులైన్లలో కలవడం వల్ల నీళ్లలో భరించరాని వాసన వస్తోందని తెలిపారు. కలుషిత నీటి సరఫరా వల్ల చిన్నారులు, పెద్దలు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. కాళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, వాంతులు, విరేచనాలు నిత్యకృత్యంగా మారుతున్నాయన్నారు. చర్మ సంబంధ వ్యాధులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.

మా మొర వినేవారే లేరు..!

నెల రోజుల నుంచి కలుషితనీటి సరఫరా జరుగుతుంటే జలమండలి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రేపు వస్తాం.. చూస్తాం.. అని చెబుతున్నారే తప్ప ఆచరణలో మాత్రం సమస్యను పరిష్కరించడం లేదు. పేద ప్రజలంటే అధికారులకు దయ లేదు. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అధికారుల జాడ లేదు. ఇక మేమెవరికీ చెప్పుకోవాలే..! అని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నింబోలిఅడ్డలో కార్పొరేటర్ పర్యటన..

నింబోలిఅడ్డ రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచి నీటి సరఫరా సరిగ్గా రావడంలేదన్నారు. వచ్చిన కొద్దిపాటి నీరు కలుషితమై వస్తోందని స్థానికులు తెలిపారు. సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జలమండలి ఏఈ షాకీర్‌కు కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బాబన్న, వాసు, లావణ్య, ఆర్. సంతోష్, మహేష్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక నాలా, భాగ్యనగర్ కమాన్, బాయమ్మ లేన్ తదితర ప్రాంతాల్లో జరుగున్న అభివృద్ధి పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ వై. అమృత పరిశీలించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే. బాబు, నాయకుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అవకాశం కల్పించాలి

లాలాపేట: మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యమైన తమ లాంటి ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని ఓయూ జేఏసీ చైర్మన్ వడ్డె ఎల్లన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తార్నాకలో ప్రొ కోదండరాంను ఆయన నివాసంలో కలిసి ఉద్యమకారుల స్థితిగతులపై చర్చించారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు ఉద్యమంలో అగ్రభాగాన ఉండి పోరాటాలు చేశారని వివరించారు.

విలువైన వస్తువులు తీసుకొస్తానని..

- ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడి అదృశ్యం


బజరంగ్ ప్రసాద్ అగర్వాల్ (ఫైల్)

హిమాయత్‌నగర్: తన విలువైన వస్తువులు కుమారుడి ఇంటి వద్ద ఉన్నాయని కూతురు ఇంటి నుంచి బయలుదేరిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నారాయణగూడ అడ్మిన్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పురాలోని డిఎంఆర్ అపార్ట్‌మెంట్‌లో హంసాజైన్ తన భర్త కమలేష్‌తో నివాసం ఉంటుంది. హంసాజైన్ తండ్రి ప్రసాద్ అగర్వాల్ (75) ఇరవై రోజుల క్రితం ఆమె ఇంటికి వచ్చాడు. అంతకు ముందు రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని ఆమె సోదరుడు సురేష్ కుమార్ అగర్వాల్ ఇంట్లో ఉండేవారు. అయితే ఈ నెల 24న ప్రసాద్ అగర్వాల్ అతనికి సంబంధించిన విలువైన వస్తువులు అతని కుమారుడు సురేష్ కుమార్ ఇంట్లో ఉన్నాయని, వాటిని తీసుకుని వస్తానని ఇంటి నుంచి బయలుదేరారు. ఇంటి నుంచి వెళ్లిన ప్రసాద్ అగర్వాల్ తిరిగి రాకపోవడం, మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తండ్రి కోసం హంసాజైన్ బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీయగా ఫలితం లేకపోవటంతో నారాయణగూడ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

తిరుమల రామచంద్ర సేవలు చిరస్మరణీయం


తిరుమల రామచంద్రకు నివాళులర్పిస్తున్న జనార్ధనమూర్తి, జయరాములు తదితరులు

చిక్కడపల్లి: ప్రముఖ కవి, రచయిత తిరుమల రామచంద్ర ఆంధ్ర పత్రికల్లో ఎన్నో ప్రయోజనాత్మక వ్యాసాలు రాశారని వక్తలు కొనియాడారు. మంగళవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో కళాసుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త కవి, రచయిత తిరుమల రామచంద్ర యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ. తెలుగు భాషలో మాండలికాలు, పదప్రయోగాల్లో గుణదోషాలపై సాధికార వ్యాసాలు రాశారన్నారు. భాషా శాస్త్ర పరిశోధనలో రామచంద్ర అగ్రగణ్యులని, ఆయన రచనలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో విశ్వసాహితీ సంస్థ అధ్యక్షుడు జయరాములు, విశిష్ట అతిథులు సీనియర్ పాత్రికేయులు జయసూర్య, ఆత్మీయ అతిథిగా త్యాగరాయ గానసభ పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు. తొలుత కవి తిరుమల రామచంద్రకు సభలో నివాళులర్పించారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు


బైరు బాలకృష్ణను సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: దేశ్యాప్తంగా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం బోలక్‌పూర్‌కు చెందిన హ్యాండ్ బాల్ ఇండియా టీమ్ కోచ్ బైరు బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఓపెన్ సెంట్రల్ ఏషియన్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియా టీమ్ బ్రాంజ్ మెడల్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ బాలకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ప్రతి రోజు ఇచ్చే శిక్షణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన బాలకృష్ణ భారత టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించి మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గానికి చెందిన యువకులకు సైతం హ్యాండ్ బాల్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి దేశ విదేశ క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. యువత క్రీడలపై దృష్టి సారించాలని భవిష్యత్‌లో విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు సైతం క్రీడాకారులకు ప్రభుత్వాలు కల్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో భోలక్పూర్ వాసులు బాబురావు, కొండల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐజాక్ రాజ్‌కు జాతీయ సేవారత్న అవార్డు


ఐజాక్ రాజ్‌కు అవార్డు అందజేస్తున్న రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్

నల్లకుంట: వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు గానూ నల్లకుంటకు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా మీడియా ఇన్‌చార్జి ఐజాక్ రాజ్ జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. 14 ఏళ్లుగా న్యాయ, విద్యా, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి ఇంటర్నేషనల్ ఇన్సానియత్ కి కిద్మత్ సొసైటీ జాతీయ స్థాయి న్యాయరత్న, విద్యారత్న, వైద్యరత్న, సామాజిక సేవా రత్న అవార్డులను అందజేస్తుంది. మంగళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్, జస్టిస్ మాల్యాద్రి, ఇన్సానియత్ కి కిద్మత్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు రెహమాన్, సినీ నిర్మాత, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ రహమతుల్లా తదితరులతో కలిసి ఐజాక్ రాజ్‌కు అవార్డు అందజేశారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షులు నాగిళ్ల నవీన్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాదాపు పదేళ్ల కాలంలో అనేక ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. లిబర్టీ సమీపాన ఉన్న లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 నాటాకి తెలంగాణలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్షపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ నిర్ధారించిందని ఆయన గుర్తు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో రెండు లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని ముఖ్యమంత్రి చొరవ చూపి దశలవారీగా పోస్టుల భర్తీకిచర్యలు చేపట్టాలని విన్నవించారు. ఉపాధి లేక ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని గ్రూప్–1,2,3,4 పోస్టుల భర్తీకి పూర్తిస్థాయిలో ఏకకాలంలో నోటిఫికేషన్ జారీ చేసేలా ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమిలో భక్తి, సాంప్రదాయ కీర్తనల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రతి సోమ, గురువారం సాయంత్రం 5.30 గంటల నుంచి మొదటి బ్యాచ్, ప్రతి మంగళ, శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు రెండో బ్యాచ్‌లో శిక్షణా తరగతులు ఉంటాయని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో అన్నమయ్య కీర్తనలు, సాయిబాబా భక్తి గీతాలు, శివ శక్తి, రామ భక్తి గీతాలు, పెళ్లి పాటలు, మంగళ హారతుల పాటల్లో శిక్షణ ఉంటుందన్నారు. టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి స్వీయ పర్యవేక్షణలో శిక్షణ ఉంటుందని చెప్పారు. వయోపరిమితి లేదని తెలిపారు. వివరాలకు సెల్: 83749 27736 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో ప్రధాని ప్రకటన చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సత్యం



కాచిగూడ: రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో ప్రధాని విధాన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. కాచిగూడలో మంగళవారం ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా జాతి జనగణనలో సమగ్ర కులగణన చేపట్టకుండా, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకుండా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచకుండా బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడినందునే బీజేపీ ప్రభుత్వానికి ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటు చేసే మెజార్టీ లేకుండా చేశారన్నారు. బీజేపీకి బీసీలు దూరమైనందునే 400 సీట్లు ఆశించిన బీజేపీ 240 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా బీజేపీ, దేశ ప్రధాని నరేంద్రమోదీ బీసీలకు చేసిన తప్పిదాన్ని గ్రహించి దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు 50శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. బీసీలను విస్మరిస్తే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేష్, నందగోపాల్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు పండరినాథ్, సూర్యనారాయణ, బీసీ నేతలు, విద్యార్థి, యువజన, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మికి పరామర్శ


భాగ్యలక్ష్మిని పరామర్శిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

కాచిగూడ: ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి భర్త రాజారామ్ ఇటీవల అకాలమరణం చెందారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు కుందారం గణేష్ చారి, బీసీ సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, బీసీ మహిళా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఎన్.నిర్మల ముదిరాజ్ అసోజు పుష్పలత, విజయలక్ష్మి, కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు మంగళవారం భాగ్యలక్ష్మిని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. రాజారాం మృతిపట్ల సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం రాజారామ్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

అధికారం కోసమే ఎమర్జెన్సీ


వెంకటరమణను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

ముషీరాబాద్: దేశంలో అధికారం కోసమే అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిందని పలువురు బీజేపీ నేతలు అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం యాంటీ ఎమర్జెన్సీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ సమయంలో అరెస్టై జైలు జీవితం గడిపిన బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణ, మోహన్‌రెడ్డిలను బీజేపీ నేతలు నరేష్, సాయికృష్ణయాదవ్, ఆర్.శేషసాయి సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు ఆర్‌విఎల్ రమేష్, కృష్ణంరాజు

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ గోల్నాక డివిజన్ ప్రధానకార్యదర్శి ఆర్‌విఎల్ రమేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ ప్రాముఖ్యత పై ప్రజల్లో మొక్కలను పెంచేందుకు ప్రధాని నరేంద్రమోది 'ఏక్ పెడ్ మా కే నామ్' పేరుతో ప్రచారాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రధాని పిలుపుమేరకు మంగళవారం కాచిగూడ, నెహ్రూనగర్‌లోని ఉమా మహేశ్వర దేవాలయ ప్రాంగణంలో అమ్మవారి పేరుతో మొక్కను నాటారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మరికంటి కృష్ణంరాజు, గాంధీ, సంతోష్ వర్మ, నిరంజన్, హనుమంతరాజ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

హిమాయత్‌నగర్: అక్రమంగా మెఫెంటర్‌మైన్ ఇంజెక్షన్లు కలిసి ఉన్న వ్యక్తిని నగర సీసీఎస్ స్పెషల్ జోన్ క్రైమ్ టీమ్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. సీసీఎస్ పోలీసుల వివరాల ప్రకారం.... బండ్లగూడ అల్–జుబైల్ కాలనీకి చెందిన మహమ్మద్ షా ఫహద్ వద్ద అక్రమంగా మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు కలిగి ఉన్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు అతడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 190 ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం చార్మినార్ జోన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు అప్పగించారు.